క్లుప్తంగా

సిరి ధాన్యాలతో ఆరోగ్యం

అశ్వారావుపేటరూరల్: సిరి ధాన్యాలతో తయారీ చేసిన ఆహారాన్ని క్రమంతప్పకుండా తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సీడీపీఓ రోజారాణి అన్నారు. మండల కేంద్రంలోని పేటమాలపల్లి వద్దఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మిల్లెట్స్ ఫుడ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, రక్త హీనతతో బాధపడే వారు తప్పనిసరిగా సిరి ధాన్యాల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించి, సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ శిరోమణి, వార్డు సభ్యులు అల్లాడి వెంకటరామారావు, ఆయా చిట్టెమ్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే న్యాయం

బూర్గంపాడు: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బట్టా విజయ్‌గాంధీ అన్నారు. మండల పరిధిలోని రామాపురంలో బుధవారం రైతు డిక్లరేషన్ విధివిధానాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పాలన కోసం ప్రజలు కాంగ్రెస్‌ను బలపరచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొర్రా భద్రయ్య, పాయం రాములు, తంగేడు కృష్ణ, పాయం రాజు, పాయం వెంకటరావు, బుచ్చిరాజు, తిరుపతిస్వామి పాల్గొన్నారు.

ములకలపల్లి: మండల పరిధిలోని రాజీవ్‌నగర్ గ్రామంలో బుధవారం కాంగ్రెస్ మండలకమిటీ ఆధ్వర్యంలో హాత్ సే జోడో యాత్రను నిర్వహించారు. మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సభ్యులు సోయం నాగరాజు, మడకం కిరణ్, మడకం ధర్మరాజు, సోడే కేశవులు, నాయకులు పాలకుర్తి సుమిత్, పాలకుర్తి రత్నభూషణం, అంజుం, అచ్చెన వెంకటేశ్వర్లు, పుష్పాల హనుమంతు, పిడియాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంస్మరణ సభ

మణుగూరురూరల్: మంద కృష్ణ మాదిగ ఆదేశానుసారం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కార్యాలయంలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమర వీరుల చిత్రపటాలకు నాయకులు పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. హుస్సేన్, నరసింహారావు, కిరణ్, రమేష్, కోటేశ్వరరావు, కొండయ్య, రజిత, రమణ పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ భద్రాచలం నియోజకవర్గ కోఆర్డినేటర్ అలవాల రాజా పెరియార్ అన్నారు. పట్టణంలో మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మాదిగ అమరవీరుల యాది సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొమ్మగిరి వెంకటేశ్వర్లు, ప్రభాకర్, రాంబాబు, చంటి, అశోక్, రాధాకృష్ణ, యేసురత్నం, వర్మ, జాని, లత, హేమలత, సూర్యవాణి, సమ్మక్క, స్వప్న పాల్గొన్నారు.

ధరలను తగ్గించాలి

భద్రాచలంటౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంబీ.నర్సారెడ్డి అన్నారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపుతున్న బీజేపీకి ప్రజలే బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో గడ్డం స్వామి, రేణుక, కోటేశ్వరరావు, సంతోష్‌కుమార్, లీలావతి, కుసుమ, సీతాలక్ష్మి, జీవనజ్యోతి, నాగరాజు, లక్ష్మణ్, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

మణుగూరురూరల్: మణుగూరు మండలంలోని అశోక్‌నగర్‌లోని ఆదివాసీ గిరిజన భవన్‌లో ఈ నెల 11వ తేదీన జరగబోయే ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఏటీఏ జిల్లా అధ్యక్షుడు బిజ్జా శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. బుధవారం మణుగూరులోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా మహాసభలకు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీమల సత్యం, రాష్ట్ర కార్యదర్శి పూనెం సారయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిగె సమ్మయ్య, సింగా రవిబాబు, కె.శ్రీనివాస్, పి.రంగారావు, ఎస్.సత్యనారాయణ, పి.అచ్చయ్య పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారం

ములకలపల్లి: ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ములకలపల్లిలో ప్రచారం నిర్వహించారు. మండలకేంద్రంలో జరిగిన కార్యకరమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కట్రం స్వామి పాల్గొని, వ్యాపార సముదాయాల్లో కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల చెన్నయ్య, కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు తాటి తులసి, సున్నం సునిత, సొసైటీ మాజీ అధ్యక్షుడు చిన్న పుల్లయ్య, సుదర్శన్, ప్రదీప్, భాస్కర్, పెద్ద బుజ్జి, శంకర్‌రావు పాల్గొన్నారు.

మద్యం సిండికేట్ మాయాజాలం

- అధిక ధరలతో మద్యం బాబుల జేబులకు చిల్లులు
- 'బ్రాండ్ల' అమ్మకం పేరుతో ఎత్తులు
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు


ఓ మద్యం దుకాణంలో వివిధ రకాల బ్రాండ్‌లు

మణుగూరురూరల్: మణుగూరులో సిండికేట్ మాటున అధిక ధరలకు మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. మందుబాబుల వీక్‌నెస్‌ను అడ్డం పెట్టుకుని కొంతమంది బడా బడా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపడుతూ కోట్లలో దోచుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ.. మణుగూరు సిండికేట్ దారులు మద్యం షాపుల్లో వినియోగదారులకు మద్యాన్ని ఎంఆర్‌పీ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. మరో పక్క మద్యంషాపుల ద్వారా విక్రయించాల్సిన మద్యాన్ని బెల్ట్ షాపుల వారికి అధిక ధరలకు సరఫరా చేస్తూ దోపిడికి పాల్పడుతున్నారు. కొంతమంది మద్యం దుకాణదారులు బ్రాండ్ల పేరుతో మద్యం ప్రియులను ఆకర్షిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. బ్రాండ్లకు అలవాటు పడిన తర్వాత నో స్టాక్ బోర్డ్ పెట్టి... మద్యంబాబులను బెల్ట్ షాపులకు వెళ్లేలా చేస్తున్నారు. ఏ బ్రాండ్ మద్యమైనా బెల్ట్‌షాపుల్లో లభిస్తుందంటే సిండికేట్ అండదండలు ఎంతగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. పట్టణంలోని మద్యం దుకాణాల కంటే బెల్ట్ షాపుల్లోనే అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులో ఉంచుతూ.. అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మద్యంబాబులు సైతం చేసేదేమి లేక అధిక ధరలకు మద్యాన్ని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. అధిక ధరలకు మద్యం కొనుగోలు చేస్తూ.. మద్యం బాబులు తమ జేబులను ఖాళీ చేసుకుంటున్నారు. మణుగూరు మద్యం సిండికేట్ మాటున ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలతో పాటు కొంతమంది అధికారులకు వాటాలు ఉన్నాయన్న వదంతలు వెల్లువెత్తుతన్నాయి. ఒక వైపు ప్రభుత్వం పెంచిన ధరలతో మద్యంబాబులు ఇబ్బంది పడుతుంటే సిండికేట్ నిర్వాహకులు విక్రయిస్తున్న అధిక ధరలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో మద్యం సీసాపై సుమారు రూ.20ల నుంచి రూ.30ల వరకు వసూలు చేస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు. గ్రామాల్లో, పట్టణాల్లో ఇళ్ళ నడుమ బెల్ట్ షాపులను నిర్వహించరాదన్న ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం లెక్కచేయకుండా ఇష్టానురీతిన అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు చేపడుతున్నారు. మద్యానికి బానిసైన వారు తమ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు. మరికొంతమంది అధికంగా మద్యం సేవించి ప్రమాదాలకు గురైన సంఘటనలు, ఘర్షణలు చోటుచేసుకున్న ఘటనలు లేకపోలేదు. ప్రస్తుత సమాజంలో యువకులు సైతం మద్యానికి అలవాటు పడి తమ బ్రతుకులను చిద్రం చేసుకుంటున్నారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు, బెల్ట్ షాపుల నిర్వహణపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సిండికేట్ అధిక ధరలను నియంత్రించి అర్ధరాత్రి వరకు బెల్ట్ షాపులను నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బెల్ట్‌షాపులను పూర్తిగా నియంత్రించాలి

గ్రామాలు, పట్టణంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన బెల్ట్‌షాపులను నియంత్రించాలి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా చేపడుతున్న మద్యం విక్రయాల వల్ల మద్యంబాబుల కుటుంబాల్లో తరచూ గొడవలు నెలకొంటున్నాయి. యువత సైతం మద్యానికి బానిసలవుతున్నారు. వెంటనే అధికారులు బెల్ట్ షాపుల నివారణకు చర్యలు చేపట్టాలి.

– టి.కమలాకర్, మణుగూరు

చర్యలు తీసుకోవాలి

మద్యం దుకాణాల్లో, బెల్ట్ షాపుల్లో అధిక ధరలకు జోరుగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. అతిగా మద్యం సేవించి అనేకమంది ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. పలువురు అంగవైకల్యానికి గురవుతున్నారు. ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి బెల్ట్ షాపులపై దృష్టి సారించాలి. అధిక రేట్లను నియంత్రించాలి. అర్ధరాత్రి వరకు బెల్ట్ షాపులను నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

– ఎస్.నవీన్, మణుగూరు

91 శాతం బొగ్గు ఉత్పత్తి


మాట్లాడుతున్న జీఎం రాంచందర్

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలో ఫిబ్రవరి నెలకు గాను 91శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్లు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకత గురించి వివరించారు. ఫిబ్రవరి నెలకుగాను మణుగూరు ఏరియా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 9లక్షల 95వేల 800లకు గాను 9లక్షల 10వేల 442లు ఉత్పత్తి చేసి 91 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. 2022–23 వార్షిక లక్ష్యంగా 108 శాతం బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. నెల లక్ష్యంలో కొంత వెనకబడినప్పటికీ వార్షిక లక్ష్యంలో మాత్రం అనుకున్న దానికంటే ఎక్కువగానే బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. ఓబీ వెలికితీతలోను ఫిబ్రవరి నెల 14లక్షల క్యూబిక్ మీటర్లకుగాను 13.40 లక్షల క్యూబిక్ మీటర్లు తీసి 96శాతంగా నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. వార్షిక లక్ష్యంలోను 86 శాతం ఓబీ తీసినట్లు తెలిపారు. ఉత్పత్తి చేసిన బొగ్గు రవాణా చేయడంలోను మణుగూరు ఏరియా ముందు నిలుస్తుందన్నారు. ఏరియాలో ఇటువంటి ఉత్పత్తి ఉత్పాదకత సాధించడానికి కృషి చేసిన ఏరియా అధికారులు, కార్మికులు, కార్మిక సంఘాల నేతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సమావేశంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, ఐఈడీ వెంకట్రావ్, డీజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారులు లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి, ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి మేరికుమారి, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, డీజీఎం ఫైనాన్స్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై అసంతృప్తితోనే చేరికలు

భద్రాచలం: రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనతో విసిగిపోయిన వివిధ వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. బుధవారం భద్రాచలం మండలానికి చెందిన పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పొదెం వీరయ్య పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను అమలు కానీ హామీలతో మోసం చేశాయని ఆరోపించారు.

ప్రజల పక్షాన పోరాడేది, అండగా నిలబడేది కాంగ్రెస్ పార్టీనేనని, రాబోయే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చేది కూడా కాంగ్రెస్సే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ళ నరేష్, టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, మాజీ గ్రంథాలయ చైర్మన్ భోగాల శ్రీనివాస్ రెడ్డి, సరెళ్ళ వెంకటేష్, చింతిరెల సుధీర్, ఎడారి ప్రదీప్, రాస మల్ల రాము, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

ములకలపల్లి: ప్రభుత్వ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. తిమ్మంపేట నుంచి గుండాలపాడు వరకు జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై ఐటీడీఏ ఏఈ సుబ్బరాజుతో మాట్లాడారు. మారుమూల గిరజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కోట్లాది రూపాయల వ్యయంతో బీటీ రోడ్లను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని, సకాలంలో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. కాలి గాయంతో బాధ పడుతూ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న మాజీ సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు కూతురు మానసను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, యూత్ అధ్యక్షుడు తాటి ప్రవీణ్, బీఆర్‌ఎస్ నాయకులు తుర్రం శ్రీను, కొండవీటి రాజారావు, పాలకుర్తి ప్రసాద్, పామర్తి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

దేశాభివృద్ధికి దిక్సూచి అంబేడ్కర్


సోంపల్లి అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

బూర్గంపాడు: దేశాభివృద్ధికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగమే దిక్సూచి అని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. సోంపల్లి గ్రామంలో రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలోని హక్కులు, బాధ్యతలను గుర్తెరిగి ప్రజలంతా మసలుకోవాలన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి భారత రాజ్యాంగం దిశానిర్దేశం చేసిందన్నారు. అంతకు ముందు మోరంపల్లిబంజర జెడ్పీఎస్ఎస్‌లో, సోంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నామన్నారు. సోంపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, మార్కెట్‌కమిటి చైర్‌పర్సన్ పొడియం ముత్యాలమ్మ, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

దమ్మపేట: మండలపరిధిలోని రంగువారిగూడెంలో నూతనంగా నిర్మించిన రామాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఐదు రోజులుగా శాస్త్రోక్తంగా పూజాకార్యక్రమాలు నిర్వహిస్తూ.. చివరిరోజైన బుధవారం భక్తుల జయజయ ధ్వానాల నడుమ విగ్రహ, ధ్వజ, బొడ్రాయిలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజల్లో పాల్గొని, తీర్థప్రసాదాలను స్వీకరించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులను అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకులు ఆదినారాయణ వేర్వేరుగా పూజల్లో పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ములకలపల్లి: మండల కేంద్రంలో శ్రీభక్త అభయాంజనేయ స్వామి ఆలయ 23వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా పంచామృతాలు, ఫలరసాలతో అభిషేకాలు, సింధూర, ఆకుపూజ చేశారు. ఆలయ అర్చకులు ముకందల సత్యనారాయణశాస్త్రి, విస్సావజ్ఝల సురేశ్ శర్మ, ప్రసాదాచారి శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. కొత్తగూడానికి చెందిన మూలగుండ్ల జగన్ దంపతులు పీటలపై ఆశీనులై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దమ్మపేటకు చెందిన భక్తబృందం ఆలపించిన హనుమాన్ ఛాలీసా పారాయణం ఆద్యంతం భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శనగపాటి రవి, భారీగా భక్తులు పాల్గొన్నారు.

దాడి అప్రజాస్వామికం

భద్రాచలం: పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై అధికార పార్టీ నాయకులు చేసిన దాడి అప్రజాస్వామికమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య బుధవారం ప్రకటనలో ఖండించారు. ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నాయకుడిపై పోలీసుల సమక్షంలోనే దాడి జరగటం హేయమైన చర్యని అభివర్ణించారు. ప్రజలలో కాంగ్రెస్ పార్టీపై పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేక భౌతిక దాడులకు బీఆర్‌ఎస్ పార్టీ దిగుతోందని ఆరోపించారు.

విజయవంతం చేయాలి

గుండాల: ఈ నెల 7వ తేదీన మహిళా దినోత్సవ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలని జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, ఎంపీటీసీ కృష్ణవేని పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రపంచ మహిళా దినోత్సవం 8వ తేదీన ఉన్నప్పటికీ తమ పార్టీ పిలుపు మేరకు 7న నిర్వహిస్తామని తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్వతి, శ్రీలత పాల్గొన్నారు.

భూమి పూజ

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణానికి గుంపెన పీఏసీఎస్ చైర్మన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్ భూమి పూజ చేశారు. స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆ నిధులతో గ్రామాల్లో అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు పోల్కంపల్లి శ్రీనివాసరావు, హమీద్, రహీం తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి


సభలో మాట్లాడుతున్న ఎంపీపీ ముక్తి సత్యం

గుండాల: కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎంపీపీ ముక్తి సత్యం, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోడేటి నాగేశ్వరావు, కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సంత ప్రాంగణంలో ఐఎఫ్‌టీయూ ఏరియా ద్వితీయ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ మతోన్మాద ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మిక హక్కులను కాలరాసిందని విమర్శించారు. ఈనెల 12 తేదీన పాలవ్యంచ పట్టణంలో జరిగే ఏడో మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు యాసారపు వెంకన్న, ఎనగంటి రమేష్, గడ్డం లాలయ్య, పర్శిక రవి, పూనెం కవిత, శ్రావన్, రవి, నాగరాజు, తాటిక్రిష్ణ, సంతు, సదానందం, సుధాకర్, నాగేష్ పాల్గొన్నారు.

శిక్షణతో స్వయం ఉపాధి

మణుగూరుటౌన్: సింగరేణి వృత్తి విద్యా శిక్షణ మహిళల స్వయం ఉపాధికి ఆలంబన అని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. బుధవారం మణుగూరు ఏరియా పీవీకాలనీలోని సీఈఆర్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. భర్త సంపాదనతో పాటు భార్య కూడా ఏదేని వృత్తి విద్యతో ఆదాయం పొందగలిగితే ఇద్దరి సంపాదతో కుటుంబంలో ఏలోటు లేకుండా జీవనం సాగించవచ్చన్నారు. సింగరేణి యాజమాన్యం ప్రత్యేక నిధులు కేటాయించి మహిళలకు ఉచితంగా వృత్తి విద్యాశిక్షణలు అందించడం జరుగుతుందన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. మణుగూరు ఏరియాకు నూతనంగా వచ్చిన ఏరియా జీఎం దంపతులకు సేవా సభ్యులు ఘన స్వాగతం పలికారు. అదే విధంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న కాంట్రాక్టు మహిళ స్వీపర్‌కు విజయకు ఏరియా సేవా సభ్యుల తరుపున రూ5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఏరియా సేవా అధ్యక్షురాలు సుమతి రాంచందర్ ఎస్ఓటూ జీఎం డి.లలిత్‌కుమార్, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, లేడీస్‌క్లబ్ సెక్రటరీ అనిత లలిత్‌కుమార్, సీనియర్ పర్సనల్ అధికారి వి రామేశ్వరరావు, సేవ సెక్రటరీ షాకీరా టైలరింగ్ ఫ్యాకల్టీ సంధ్యారాణి బ్యూటీషియన్ ఫ్యాకల్టీ సౌజన్యలు పాల్గొన్నారు.

సునితకు సన్మానం..

సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు ప్లానింగ్ వెంకటేశ్వరరెడ్డి సతీమణి సునితా వెంకటేశ్వరరెడ్డిని బుధవారం మణుగూరు సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. సేవా అధ్యక్షురాలిగా మణుగూరు నుంచి పదోన్నతిపై బదిలీ అయిన సునితను ఏరియా జీఎం దంపతులు ఘనంగా సన్మానించారు.

సృజనాత్మకత పెంపు అవసరం


సైన్స్ ఫెయిర్‌లో వైజ్ఞానిక ప్రాజెక్టులతో విద్యార్థులు

అన్నపురెడ్డిపల్లి: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకుని నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎర్రగుంట జెడ్పీ పాఠశాలలో తొలిఅడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు మండలాల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సైన్స్ ఫెయిర్‌ను ఎంఈఓ సత్యనారాయణ ప్రారంభించారు.

అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రాజెక్టులను తిలకించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఉత్తమ వైజ్ఞానిక ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సైన్స్ ఫెయిర్‌ను ఏర్పాటు చేసిన తొలి అడుగు ఫౌండేషన్ సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తొలిఅడుగు ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితులపై శిక్షణ

దుమ్ముగూడెం: అత్యవసర సమయాలలో ఎలా స్పందించాలి అనే దానిపై మండలంలోని పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా వర్కర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి శిరీష ఆదేశాల మేరకు డీపీహెచ్‌యస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో నోరు, కన్ను, చెవి, నోటి క్యాన్సర్ ప్రమాదాలు జరిగినప్పుడు, గండెపోటు వచ్చినప్పుడు, 108 వాహనం ద్వారా బాధితులను ఎలా పంపించాలో నేర్పించారు. మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పని చేస్తున్న 105 మంది ఆశా వర్కర్‌లు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రేణు కారెడ్డి, సీహెచ్ఓ కాంతమ్మ, డీపీఎంఓ సత్యనారాయణ, సిబ్బంది సదుగుణ వాణి, రామలక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లింగవివక్షతను అరికట్టాలి

దుమ్ముగూడెం: సమాజంలో పెరుకుపోతున్న లింగ వివక్షతను ఆరికట్టాలని ఐసీడీఎస్ జిల్లా అధికారిణి లెనినా పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రామారావుపేట గ్రామంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లింగవివక్షతపై అవగహన కల్పించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఆడ, మగ అనే భేదం తల్లి గర్భం దాల్చిన నుంచి చూపిస్తున్నారని తెలిపారు. జెడ్పీటీసీ తెల్లంసీతమ్మ మాట్లాడుతూ.. ఆడపిల్లలపై ఎక్కువ అగయిత్యాలు జరుగుతున్నాయని ప్రతి ఒక్క తల్లిదండ్రులు అమ్మాయి, అబ్బాయిలను సమానంగా చూస్తు వారికి మంచి భవిష్యత్తు కల్పించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సోయం పార్వతి, సీడీపీఓ సలోమి, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

భద్రాచలంటౌన్: విద్యుత్ పనులు చేసే సమయంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు అప్రమత్తంగా ఉండాలని బీఆర్‌ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెల్లం వెంకట్రావు సూచించారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పట్టణంలో అసోసియేషన్ భవన నిర్మాణం కోసం స్థలాన్ని సమకూర్చుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుధాకర్, రమాకాంత్, బంబోతుల రాజీవ్, వెంకట్, విజయ్, గంగా భారతి, లక్ష్మీబాయి, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని ఆసుపాక గ్రామంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసి పర్యటించారు. గ్రామానికి చెందిన రామినేని నారాయణరావు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందగా, దశదిన కార్యక్రమానికి హాజరై చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుని కుటుంబీకులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, దమ్మపేట జెడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పుల్లారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమ్మె బాటలో అంగన్‌వాడీలు

సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు బుధవారం సమ్మె చేపట్టారు. భారీ ప్రదర్శనలు చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా బుధవారం నుంచి రేపటి వరకు సమ్మెను నిర్వహించనున్నారు. ఐసీడీఎస్‌కి బడ్జెట్‌లో అధిక నిధులు, నాణ్యమైన పోషకాహారం, మినీ అంగన్‌వాడీలను శాశ్వత అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తించడం, ఆరోగ్యలక్ష్మి, మోనూ చార్జీలను పెంచడం, టీఏ, డీఏ, ఇన్‌చార్జ్ అలవెన్సులు, ఇంక్రిమెంట్‌లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యం, కనీస వేతనం రూ.26 వేలు చెల్లింపు తదితర డిమాండ్లతో సమ్మె కొనసాగింది.

– సాక్షి నెట్‌వర్క్


మణుగూరురూరల్: పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు



దుమ్ముగూడెం: ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


అశ్వారావుపేట: ధర్నాలో మాట్లాడుతున్న కొక్కెరపాటి పుల్లయ్య